



హైడ్రా హడల్

» వారం రోజుల్లో నిర్మల్ చెరువుల అక్రమణలపై కార్యాచరణ షురూ » పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ » ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కీలక సమీక్ష » హద్దులపై అనుమానాలు » వారం రోజుల్లో ఆపరేషన్ షురూ

నిర్మల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న హైడ్రా ఆపరేషన్ వారం రోజుల్లోపు నిర్మల్‌లో మొదలుకాబోతోంది. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని గొలుసుకట్టు చెరువు భూముల ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పూర్తిస్థాయిలో సమీక్ష జరిపారు. ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులతో జరిపిన సమీక్ష అనంతరం వారం రోజుల్లోగా అన్ని రకాల చెరువు భూములకు సంబంధించి నివేదికలను తనకు అందించాలని, నివేదికలు అందిన మరుసటి రోజు నుంచే ఆపరేషన్ మొదలుపెట్టాలంటూ కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అయితే ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రాథమికంగా సరిహద్దులకు సంబంధించి అందించిన రికార్డులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, కబ్జాలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ వివరాలతో సంతృప్తి చెందని కలెక్టర్ అధికారులకు మరోవారం రోజుల పాటు గడువును ఇస్తూ ఎలాగైనా డిజిటల్ రికార్డులతో పాటు 1958 సంవత్సరం నుంచి ఉన్న హద్దుల వివరాలు తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో గొలుసుకట్టు చెరువుల ఆక్రమణదారులు రికార్డులను తారుమారు చేసి ఖరారు చేసిన హద్దులన్నీ చెరిగిపోయే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇక్కడి చెరువులను ఆక్రమించిన కబ్జాదారులు కొంతమంది తమకున్న పలుకుబడితో రికార్డులను తారుమారు చేసి తాము ఆక్రమించిన భూములను బఫర్ జోన్ పరిధిలోకి రాకుండా చేసుకున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయితే నిమ్మనాయుడు కాలం నుంచి ఉన్న గొలుసుకట్టు చెరువుల అసలు విస్తీర్ణంపై కలెక్టర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే వారం రోజుల్లోగా మొత్తం 13 గొలుసుకట్టు చెరువుల వాస్తవ విస్తీర్ణాన్ని ఖరారు చేసిన తరువాత ఆ చెరువులకు సంబంధించిన బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలపై హైడ్రా పంజా విసిరేందుకు సిద్ధం కాబోతోందని అంటున్నారు. హైడ్రా ఆపరేషన్‌పై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా వ్యవహరిస్తున్న కారణంగా ఇక చెరువు భూముల్లోని ఆక్రమణలకు చెక్ పడబోతోందని అంటున్నారు.

హద్దులపై అనుమానాలు

ఇదిలా ఉండగా చెరువు భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో విస్తీర్ణంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల హద్దులపై అధికారులు రూపొందించిన నివేదికలపై కలెక్టర్ పూర్తిస్థాయిలో విశ్వసించడం లేదంటున్నారు. 1958 సంవత్సరం నాటి రికార్డుల ప్రకారం చెరువు భూముల అసలు విస్తీర్ణంతో పాటు ఎఫ్‌టీఎల్, శిఖం రికార్డులను కూడా తనకు సమర్పించాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులు 2010 సంవత్సరం నుంచి డిజిటల్ సర్వే వివరాల ఆధారంగా హద్దుల నిర్ధారణ చేపట్టినట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తనకు వాస్తవ రెవెన్యూ రికార్డుల ప్రకారం నివేదికలు కావాలంటూ అధికారులను సూచించారు. దీంతో అధికారులు రికార్డుల అన్వేషణలో నిమగ్నమయ్యారు.

హైడ్రా ఆపరేషన్‌కు రంగం సిద్ధం

జిల్లాలోని చారిత్రక గొలుసుకట్టు చెరువుల హద్దులకు సంబంధించిన భూముల ఆక్రమణలపై కలెక్టర్ అభిలాష అభినవ్ సీరియస్‌గా స్పందిస్తుండడం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న హైడ్రా ఆపరేషన్‌ను జిల్లా కేంద్రంలో కూడా చేపట్టి గొలుసుకట్టు చెరువుల భూములను రక్షించాలన్న ధ్యేయంతో కలెక్టర్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత పది రోజుల నుంచి కలెక్టర్ చెరువు భూములపై తనకున్న సమాచారం మేరకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇరిగేషన్ శాఖ అధికారులతో ఇప్పటికే జిల్లా కలెక్టర్ పలు దఫాలుగా సమీక్షించారు. అలాగే రెవెన్యూ అధికారులతో సైతం ఈ విషయమై కలెక్టర్ చర్చించారు. అయితే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ రికార్డుల మధ్య తేడాలున్న కారణంగా కలెక్టర్ తనకు పూర్తిస్థాయిలో హద్దులకు సంబంధించిన రికార్డులను సమర్పించాలంటూ సీరియస్‌గా ఆదేశించారు. దీంతో ఈ రెండు శాఖల అధికారులు ఇక పాత, కొత్త రికార్డుల ఆధారంగా హద్దుల లెక్కలను నిర్ధారించే పనిలో నిమగ్నమయ్యారు.

వారం రోజుల్లో ఆపరేషన్ షురూ

ఇదిలా ఉండగా జిల్లాలోని గొలుసుకట్టు చెరువు భూముల ఆక్రమణలపై వారం రోజుల్లో హైడ్రా తరహా ఆపరేషన్ మొదలుకానున్నట్లు చెబుతున్నారు. ఈ ఆపరేషన్‌కు కలెక్టర్ అభిలాష అభినవ్ స్వయంగా నేతృత్వం వహించే అవకాశం ఉంది. చెరువు భూముల ఆక్రమణలపై సీరియస్‌గా ఉన్న కలెక్టర్ అధికారుల తూతూమంత్రపు నివేదికలను పట్టించుకోకుండా వాస్తవ నివేదికల కోసం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ సీరియస్ ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంగా వాస్తవహద్దులు అలాగే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులపై కలెక్టర్‌కు వారం రోజుల్లోగా నివేదికలు సమర్పించనున్నారు. ఈ నివేదికలతో పాటు తన వద్ద ఉన్న పక్కా సమాచారంతో ఆపరేషన్ హైడ్రాను మొదలుపెట్టేందుకు కలెక్టర్ సిద్ధం కాబోతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.


జిల్లా కేంద్రంలో నడిబొడ్డున గల ధర్మసాగర్ చెరువు ఇదే


ఎన్టీఆర్ మార్గ్ సమీపంలో ఉన్న చెరువు కబ్జాకు గురవుతున్న దృశ్యం

కుంటాలలో వెలుగు చూసిన భైరవ విగ్రహం


వెలుగు చూసిన భైరవ విగ్రహం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 27 : కుంటాల మండల కేంద్రంలో 9వ శతాబ్దపు భైరవ విగ్రహాన్ని గుర్తించినట్టు చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావు తెలిపారు. గజ్జలమ్మ ఆలయానికి తూర్పున క్రీస్తు శకం 6వ శతాబ్దానికి చెందిన భైరవ విగ్రహం రాష్ట్ర కూట రాజు చెక్కినట్టు తెలుస్తోం దన్నారు. కుంటాల గ్రామానికి రాష్ట్ర కూట రెండవ కృష్ణుడి వల్ల ఈ పేరు స్థిరపడిందని భావిస్తున్నట్టు తెలిపారు. భైరవ సంప్రదాయం, శాక్తేయమత సాంప్రదాయం ఇక్కడ కొనసాగిందని ఆధారాలు తెలుపుతున్నాయన్నారు. 16వ శతాబ్దపు మరో విగ్రహం కూడా ఈ ప్రాంతంలో గుర్తించినట్టు వివరించారు

ఎస్‌ఎఫ్‌సీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 27 : రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి, కొంతం గణేష్, శ్రీనివాస్, కార్తీక్, తదితరులు కలిసి ఆయనకు చిత్రపటాన్ని అందజేశారు.

ప్రవాసి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న బాధితులు



ప్రవాసి ప్రజావాణి వద్ద నిర్మల్ బాధితులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 27 : విదేశాల్లో పనిచేసే తెలంగాణా కార్మికుల బాధలను వారి కుటుంబ సభ్యుల ద్వారా విన్నవించుకునే 'ప్రవాసి ప్రజావాణి' కార్యక్రమాన్ని హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా నుంచి నలుగురు బాధితులు వారి కుటుంబ పెద్దలు గల్ఫ్ దేశాలలో ఉపాధి కోసం వెళ్లి మరణించటం వల్ల ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని మంత్రికి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవ రాజన్ ఐఏఎస్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల, యూనియన్ కో ఆర్డినేటర్ కొమ్ము గీత, మృతుల కుటుంబాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

గోదావరిలో పడి ఒకరి మృతి

బాసర, సెప్టెంబరు, 27 : నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన జయ (45) అనే మహిళ శుక్రవారం బాసర వద్ద గోదావరి నదిలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులతో బాసరకు వచ్చిన ఆమె మొదట గోదావరిలో పుణ్యస్నానాలు చేసేందుకు నదిలో దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో జయతో పాటు ఆమె మరదలు నదిలోకి జారిపోయారు. వెంటనే అక్కడున్న ఇతర యాత్రీకులు గమనించి జయ మరదల్ని కాపాడారు. కాని జయ అనే మహిళ మాత్రం నదిలో మునిగి ప్రాణాలు విడిచింది. మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర పోలీసులు తెలిపారు.

లక్ష్మణచాందలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

● రాత్రి సమయంలో పరిస్థితులపై 'కస్తూర్బా'లో పరిశీలన


కస్తూరిబా విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

లక్ష్మణచాంద, సెప్టెంబరు 27 : మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాల, కళాశాలను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. పదవ తరగతి విద్యార్థులను మ్యాథ్స్ సబ్జెక్టుపై ప్రశ్నలు అడిగారు. మ్యాథ్స్‌లో పర్ఫెక్ట్ కావాలంటే బాగా ప్రాక్టీస్ చేయాలన్నారు. అనంతరం వసతి గదులను పరిశీలించారు. ల్యాబ్‌లోకి వెళ్లి పలు ప్రాక్టికల్స్‌పై ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల వస్తానని, మిమ్మల్ని ప్రశ్నలు అడుగుతానన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీవో అమీర్, సెక్టోరియల్ అధికారి సలోమి, ప్రత్యేక అధికారి రాంపెల్లి నవిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలో ముగిసిన ఇంధన వనరుల సదస్సు

బాసర, సెప్టెంబరు, 27: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న స్మార్ట్ గ్రిడ్ ఇంధన వనరుల సదస్సు శుక్రవారం నాటితో ముగిసింది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగ ఆధ్వర్యంలో స్మార్ట్‌గ్రిడ్ పునరుత్పాదక ఇంధన వనరులపై జ్ఞానాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యలో వస్తున్న మార్పులు డిమాండ్లను తీర్చడానికి అధ్యాపకులు, విద్యార్థులు నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి అవసరం చాలా ముఖ్యమని నిపుణులు సూచించారు. సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా, అనలిటిక్స్ పవర్ క్వాలిటీ, రియల్‌టైం సిమ్యులేషన్ సిస్టంలు వంటి స్మార్ట్‌గ్రిడ్‌లోని అనేక రకాల అంశాలను కవర్ చేయడానికి నిమిషాల వ్యవధిలో ప్రతిసెషన్‌తో నిర్మాణాత్మక మద్దతు, వనరులను అందించడానికి ఈ ప్రోగ్రాం నిర్వహించడం ఎంతో ఉత్తమమైనదని ఇంజనీర్లు తెలిపారు. వివిధ సాంకేతిక ప్రాజెక్టులలోని జ్ఞానాన్ని విద్యార్థులకు ఉపయోగించడానికి భాగస్వామ్యం చేయాలని యాజమాన్యం సూచించిందని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


చివరి రోజు సదస్సులో ఇంజనీర్లు, విద్యార్థులు

జిల్లాకు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్ర అవార్డు

● క్రాఫ్ట్స్ కేటగిరీలో నిర్మల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 27 : తెలంగాణలోని రెండు పర్యాటక గ్రామాలకు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కాయి. 2024 సంవత్సరానికి గాను కేంద్ర పర్యాటక శాఖ ఎనిమిది కేటగిరీలలో నిర్వహించిన పోటీలలో 'స్పిరిచ్యువల్ - వెల్నెస్' కేటగిరీలో నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల, 'క్రాఫ్ట్స్' కేటగిరీలో నిర్మల్‌ను ఎంపిక చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సంవత్సరంగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కడ్ ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ఈ అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ టాయ్స్, ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.పెంటయ్య, సోమశిల జిల్లా పర్యాటక శాఖ అధికారి టి. నర్సింహా ఈ అవార్డులను అందుకున్నారు. సోమశిల, నిర్మల్‌కు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కడంపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మలకు, పెయింటింగ్స్‌కు, తన సొంత నియోజకవర్గమైన కొల్లాపూర్‌లోని సోమశిలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ వాసులకు, సోమశిల గ్రామస్థులకు, కళాకారులకు, పర్యాటక శాఖ అధికారులు, సిబ్బందికి మంత్రి జూపల్లి అభినందించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో టూరిస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణ పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దు తామని ఈ సందర్భంగా తెలిపారు. రానున్న రోజుల్లో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. తెలంగాణ కళలకు అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, కళాకారుల నైపుణ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రి ఎదుట ఆందోళన

● ఖానాపూర్‌లో రిజిస్ట్రేషన్ లేని వైద్యులతో ఆసుపత్రి నడుపుతున్నారంటూ ఆరోపణ ● చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ ● ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎం అండ్ హెచ్‌వో ● చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన జిల్లా అధికారి


ఆసుపత్రి నిర్వాహకులతో స్థానికుల వాగ్వాదం


ఖానాపూర్ తిరుమల ఆసుపత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో

ఖానాపూర్, సెప్టెంబరు 27 : పట్టణంలో అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్‌కు చెందిన పలువురు ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... వివేకానంద చౌక్‌లో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రికి ఎటువంటి అనుమతులు లేవని ఆరోపించారు. బుధవారం జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రికి వైద్యం చేయించుకునేందుకు వచ్చిన ఖానాపూర్‌కు చెందిన పాదం మల్లవ్వ అనే మహిళ వద్ద అధికంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. తీసుకున్న డబ్బులకు బిల్లు ఇవ్వాలని కోరగా కేవలం తెల్లకాగితంపై బిల్లు రాసి ఇచ్చారని ఎటువంటి బిల్లు గాని ఆసుపత్రి పేరిట ఉన్న రసీదు గాని ఇవ్వలేదన్నారు. ఆసుపత్రిలో నిరంతరం ఇటువంటి తతంగం జరుగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిగా సేవలందిస్తున్న వైద్యురాలికి ఎన్‌ఎంసీ ఎగ్జిట్ పరీక్షకు సంబంధించిన రిజిస్ట్రేషన్ లేదన్నారు. ఆసుపత్రి బోర్డుపై ఏర్పాటు చేసిన వైద్యురాలి పేరు కింద ఎటువంటి రిజిస్ట్రేషన్ నెంబర్ రాయకుండా ఎంబీబీఎస్ అని రాసి స్త్రీల వైద్య నిపుణులు అని రాయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. గైనకాలజీ విభాగంలో ఎటువంటి అర్హత లేకపోయినప్పటికీ స్త్రీ వైద్య నిపుణురాలని ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఆసుపత్రి నిర్వాహకులు శ్రీనివాసన్‌ను వివరణ కోరగా... తమ ఆసుపత్రిలో అధికంగా బిల్లులు వసూలు చేస్తున్నారనేది కేవలం ఆరోపణే అన్నారు. ఆసుపత్రికి మాత్రం రిజిస్ట్రేషన్ లేదని త్వరలో దరఖాస్తు చేసుకుంటామన్నారు. స్త్రీల వైద్య నిపుణురాలు అని పేర్కొన్న వైద్యురాలు సైతం ఎన్‌ఎంసీ ఎగ్జిట్ పరీక్ష తాలూకు సర్టిఫికెట్ లేదన్నారు.



ఖానాపూర్‌లోని తిరుమల ఆసుపత్రి

అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహించినందున చర్యలు తీసుకుంటాం

● డీఎం అండ్ హెచ్‌వో రాజేందర్

ఖానాపూర్‌లోని తిరుమల ఆసుపత్రికి ఎటువంటి అనుమతి లేదని డీఎం అండ్ హెచ్‌వో రాజేందర్ తెలిపారు. ఆసుపత్రిపై వచ్చి ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆయన ఖానాపూర్‌లోని తిరుమల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఇద్దరు డాక్టర్లు ఒకరికి మాత్రమే ప్రాక్టీస్ చేసుకునేందుకు అర్హత ఉందన్నారు. ఆసుపత్రిలో మహిళా వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం ఆమె అందుబాటులో లేనందున ఆమె పేరును తొలగించాలని ఆసుపత్రి నిర్వాహకులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇన్నాళ్లు సదరు వైద్యురాలిని స్త్రీ వైద్య నిపుణురాలుగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించడం పట్ల చర్యలు చేపడతామన్నారు. ఆసుపత్రికి సైతం ఎటువంటి అనుమతి లేనందున ఆసుపత్రి యాజమాన్యానికి జరిమానా విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స


శస్త్రచికిత్స తర్వాత రోగితో మాట్లాడుతున్న డాక్టర్లు జగన్‌కుమార్, శశికాంత్

నిర్మల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చాలా అరుదైన ఆరోగ్య సమస్యకు... అత్యంత నాణ్యమైన శస్త్ర చికిత్సను చేశారు. జీవితాంతం జీవచ్ఛవంలా బతకాల్సిన వ్యక్తిని కాపాడారు. ఎక్కడో... హైదరాబాద్, నిజామాబాద్ వంటి కార్పొరేట్ ఆసుపత్రులలో కాకుండా జిల్లా కేంద్రంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలోనే ఈ అరుదైన ఆపరేషన్ చేయడం విశేషం. ఎల్వి గ్రామానికి చెందిన 20 ఏళ్ల మారుతి కొంతకాలంగా వెన్నుముక సమస్యతో బాధపడుతున్నాడు. ఇప్పటికే పలు ఆసుపత్రులలో పరీక్షలు, వైద్యం చేయించుకున్నప్పటికీ ఇబ్బంది తప్పలేదు. చివరకు జిల్లాకేంద్రంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించగా... స్పైనల్ కార్డులో ట్యూమర్ ఉన్నట్లుగా గుర్తించారు. న్యూరో సర్జన్ డాక్టర్ జగన్‌కుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ నాళం శశికాంత్ ఈ నెల 26న స్థానికంగానే అరుదైన శస్త్రచికిత్స చేసి, ట్యూమర్ తొలగించారు. వెన్నుముకలో ఈ ట్యూమర్ ఇలాగే ఉండి ఉంటే మారుతి రెండు కాళ్లు చచ్చుబడిపోయి ఉండేవని, పక్షవాతానికి గురయ్యే అవకాశం ఉండేదని ఆసుపత్రి వైద్యుడు నాళం శశికాంత్ వివరించారు. ప్రస్తుతం మారుతి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సౌకర్యం కూడా ఉందని తెలిపారు.

నేడు విద్యార్థులకు హిందూ ధార్మిక పోటీలు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 27 : నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు శనివారం ఉదయం 10 గంటలకు దేవరకోట ఆలయ ప్రాంగణంలో హిందూ ధార్మిక పోటీలు నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8-10 తరగతి విద్యార్థులు ప్రతి పాఠశాల నుండి 10 మంది పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వ్యాసరచన పోటీ హిందూ ధర్మ రక్షణపై మీ వంతు పాత్రపై ఉంటుందన్నారు. రామాయణ, మహాభారత, భాగవతంతో పాటు జనరల్ నాలెడ్జ్, దేశ దైవ భక్తి గీతాల పోటీ, హనుమాన్ చాలీసా పోటీలుంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

నర్సాపూర్(డబ్ల్యూ)లో పర్యటించిన ఎంపీడీవో రాధా రాథోడ్

లక్ష్మణచాంద, సెప్టెంబరు 27 : మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో ఎంపీడీవో రాధా రాథోడ్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని పలు వార్డులను, అందులోని డ్రైనేజీలు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శిని పారిశుద్ధ్య కార్మికులను అభినందించి సన్మానించారు. అనంతరం ఎంపీపీ ఎస్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలోని పరిసర ప్రాంతాలు చాలా శుభ్రంగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఇంకా పెంచాలని తెలియజేశారు.



పచ్చని అటవితో కోసాయి అందాలు

ప్రకృతి ఒడిలో పల్లెసీమలు

ఆదిలాబాద్ జిల్లా అంటేనే ప్రకృతికి పెట్టింది పేరు. జిల్లాలో ప్రస్తుతం కురిసిన వర్షాలకు పల్లెలు ప్రకృతి ఒడిలో విరాజిల్లుతు న్నాయి. ఎటు చూసినా పచ్చదనం పంట పొలాలు అడవి అందాలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పలు గ్రామాలు పర్యాటక స్థలలను తలపించే విధంగా చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి - ఆదిలాబాద్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్)



పచ్చని అందాలతో బరంపూర్ గ్రామం

ఆదివాసీ గిరిజన గ్రామాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో పర్యటన

తలమడుగు, సెప్టెంబరు 27: మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన మనోహర్ పర్యటించారు. మండలంలోని దేగామా గ్రామంలో చిన్న పాపకు డెంగ్యూ జ్వరం రావడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాధి తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హరీష్, వైద్య సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు

ఆదిలాబాద్, సెప్టెంబరు 27: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరికి ఈ అకాడమిక్ ఇయర్లో మినిమం టైం స్కేల్ ఇవ్వడం జరుగుతుందని, ఈ సమస్య హర్షవర్ధన్‌రెడ్డి తప్పకుండా పరిష్కరిస్తానని చెప్పడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఏకీకృత సర్వీస్‌రూల్స్ సాధించడం, సీపీఎస్ రద్దు చేయడం జరుగుతుందని అధ్యక్షుడు చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడేనూర్ సింగ్, నర్రా నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి'

నార్నూర్, సెప్టెంబరు 27: గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్‌చరణ్‌దాస్ అన్నారు. శుక్రవారం సోనాపూర్ గ్రామ పంచాయతీ బేతాల్గుడా గ్రామం వద్ద వైద్య శిబిరం నిర్వహించి తొమ్మిది మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. గర్భిణీ మహిళలు రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. పాలు చేపలు గుడ్లు ఆకుకూరలు ఐరన్ క్యాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపాలని కోరారు. వారి వెంట గణేష్ ప్రియాకం ఏఎన్ఎం కైలాస్ జవహర్ ఆశా కార్యకర్తలు మానుకుబాయి తదితరులున్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు

నేరడిగొండ, సెప్టెంబరు 27: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నేరడిగొండ మండలంలో జోరుగా సాగుతోంది. శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని అన్నారు. ప్రపంచంలో మన దేశ ప్రతిష్ఠ ఎంతో పెరిగిందన్నారు. దేశ ప్రజలు ప్రధాని మోదీకి మద్దతుగా మేమున్నామని స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్, మండల కార్యదర్శులు బాక్రెశేఖర్, బొంతుకుల శ్రీను, జాదవ్ భీంరావు, నాయకులు సరసాని మహేందర్‌రెడ్డి, గాదె శంకర్, రతీష్, మనోజ్, మోతిరాం, సందీప్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సహజ ఎరువులతోనే పంటలను సాగు చేయాలి

● ఏఈవో సంతోష్

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 27: మండలం పరిధిలోని రైతులందరూ సహజ ఎరువులను ఉపయోగించి పంటలను సాగు చేయాలని ఏఈఓ సంతోష్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని బలంపూర్ గ్రామంలో పత్తి పంటను, సోయా పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ ఎరువులను ఉపయోగించి పంటలను పండించినట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. దీంతో పాటు గా పర్యావరణాన్ని కలిసిన కాకుండా నేల స్వభావం మరింత మెరుగవుతుందని తెలిపారు.ఇష్టారేతిన్నా రసాయన ఎరువులను ఉపయోగించినట్లయితేనే సారవంతమైన నేల స్వభావం కోల్పోతుందని పంటలు పండించడానికి అనువుగా ఉండకుండా తయారవుతుందని తెలిపారు. రైతులు పంటను సాగు చేసే క్రమంలో ప్రతి విషయాన్ని వ్యవసాయ అధికారులతో చర్చించి వారిచ్చిన సూచనలో పాటిస్తూ పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు.

వేంకటేశ్వర స్వామి పాదాలు తాకిన సూర్య కిరణాలు

తలమడుగు, సెప్టెంబరు 27: మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభూగా వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సూర్య కిరణాలు శ్రీ వేంకటేశ్వర స్వామి పాదాలు తాకడంతో భక్తులు కన్నుల పండుగగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదారేశ్వర్ మాట్లాడుతూ దినం దినం తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న బరంపూర్ వేంకటేశ్వర స్వామికి పాదాలను సూర్య కిరణాలు తాకడం ఎంతో అదృష్టం అన్నారు. ఇలాంటి దృశ్యాలను చూడడం పూర్వ జన్మ సుకృతమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో వేద పండితులు తిరునగిరి స్వస్తిక్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి పాదాలు తాకిన సూర్య కిరణాలు

అనాథ పిల్లలకు ఆర్థికసాయం అందజేత

సిరికొండ రూరల్, సెప్టెంబరు 27: తల్లిదండ్రులను కోల్పోయి ఇద్దరు పిల్లలు అనాథలుగా జీవిస్తుండడంతో వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు శ్రీ సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ యాదవ్ ముందుకొచ్చి రూ.10 వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడంతో పాటు వారికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసాయి వైకుంఠ ట్రస్ట్ సభ్యులు మహేందర్ యాదవ్ మాట్లాడుతూ.. సిరికొండ మండల కేంద్రానికి చెందిన దాసరి రజిత శ్రీనివాస్ దంపతులు గత నెలల క్రితం మృతిచెందడంతో వారి పిల్లలు మేఘన, రిశ్వంత్‌లు అనాథలుగా మారి తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి కావడంతో తమ దృష్టికి రావడంతో ఇక్కడికి వచ్చి సాయం చేశామన్నారు. ఎవరికీ ఎలాంటి ఆపద వచ్చినా సహాయం చేయడానికి శ్రీ సాయి వైకుంఠ ట్రస్ట్ ముందుంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి వైకుంఠ ట్రస్ట్ సభ్యులు పోషాలు, రవి, రాజన్న, రాములు, మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న, గొర్ల రాజన్న, బాలాజీ, రాజేష్, స్వామి, విజయ్, మల్లేష్, ఆనంద్‌రావు, నరేష్ జకారియా, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న పీవో ఖుష్బు గుప్తా

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 27: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల పచ్చి ఆకు కూరగాయాల ఆహారాన్ని, గుడ్లు, పాలు, రాగి, మాల్టా అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని అన్నారు. నిత్యం పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంట గది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఔషధాల రిజిష్టర్ పరిశీలించి ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఇందులో అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలతో చిన్నారుల్లో మనోవికాసం'

ఇచ్చోడ, సెప్టెంబరు 27: అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారుల్లో మనోవికాసం కలుగుతుందని మండల ప్రతేక్యాధికారి జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దేవులనాయక్‌తాండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన చిన్నారులతో సరదగా ముచ్చటించారు. ప్రైవేటుకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన ఉంటుందనడానికి ఈ కేంద్రాలే నిదర్శనమన్నారు. గ్రామాల్లోని చిన్నారులకు టీకాలను సకాలంలో వేసేలా ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు చూడలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పలువురి ఇళ్లకు వెళ్లి పర్యావరణ పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, గ్రామ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

బోథ్, సెప్టెంబరు 27: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతీఒక్కరి బాధ్యతగా భావించాలని బోథ్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ పిబి హాస్నేన్ పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో జడ్జి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఆనందంగా జీవించవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి విజయ్‌కుమార్, కోర్టు సూపర్ ఇండెంట్ శేఖర్‌రెడ్డి, ముజీద్, శ్రీకాంత్, కోర్టు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జైనథ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నైనత అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కంటం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి పాత్రలలో నిల్వ ఉన్న వర్షం నీటిని తొలగించారు. మురికి కాల్వలలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. సీజనల్ వ్యాధులపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త నమునాలను సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓతో పాటు గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

● ఘన నివాళ్లు అర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 27: ప్రత్యేక తెలంగాణ సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనిదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆదిలాబాద్ పట్టణంలో అధికారికంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూవో రాజలింగు, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే, మలిదశ తెలంగాణ రాష్ట్ర పోరాట యోధుడు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న మహోన్నతి వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బాపూజీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఆదిలాబాద్: ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజి 109వ జయంతిని సందర్భంగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువజన జిల్లా అధ్యక్షుడు సాయి



ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది



ఆదిలాబాద్‌లో పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

చరణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు వేముల నాగరాజ్, మావల మండల్ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● లక్ష్మణ్ బాపుజీని ఆదర్శంగా తీసుకోవాలి

ఇచ్చోడ: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపుజీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాల ఆవరణలో లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమకారుల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం హార్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, సోమన్న, గోవర్ధన్, బాలాజీ, శ్రీనివాస్, బాస్కర్, రాజేశ్వర్ నాగభూషన్, మాదవి, ప్రవీణా, తదితరులు పాల్గొన్నారు.

● కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు అమోఘం

తాంసి రూరల్: తెలంగాణ సమాజానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని తాంసి తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సిబ్బంది లలిత, అశోక్, అడెల్లు స్వాగత్, రాహుల్, ప్రశాంత్, ప్రవీణ్, రఫీక్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, ఎమ్మెల్యే అనిల్

బాపూజీ గొప్ప ఉద్యమ నాయకుడు

● ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే

బోథ్, సెప్టెంబరు 27: కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప ఉద్యమ నాయకుడు అని ఆయన చేసిన త్యాగం ఎంతో గొప్పదని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షురాలు మంచికుంట ఆశమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంటి, సహకార సంఘ డైరెక్టర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులున్నారు.

● సభలో ఎమ్మెల్యే వర్సెస్ కార్పొరేషన్ చైర్మన్

బోథ్: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒక దశలో నువ్వు ఎంత? నీ పార్టీ ఎంత? అనే స్థాయిలో ఇరువురు విమర్శల దాడికి దిగారు. అయితే అక్కడే ఉన్న పోలీసులు జోక్యం కల్పించుకుని వివాదం సద్దుమణిగేలా చేశారు.

వైద్యం అందించాలంటే వాగు దాటాల్సిందే..

● వైద్య సిబ్బందికి తప్పని తిప్పలు

ఉట్నూర్, సెప్టెంబరు 27: ఏజెన్సీలోని ఏ గ్రామాన్ని చూసినా.. ఏ ముంది గర్వకారనం అన్న విధంగా ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాలలో ప్రజలకు వైద్య సేవలు అందాలంటే వైద్య సిబ్బంది వాగులు దాటాల్సిందే.!! ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్ జె (దమ్మన్నపేట్) గ్రామానికి వెళ్లాలంటే మూడు వాగులు దాటాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం భారీగా నిధులు మంజూరు చేయడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇంజనీరింగ్ శాఖ అధికారులు రెండు వంతెనలు వాగులపై నిర్మించగా, మరో వంతెన నిర్మాణానికి అనుమతులు లేవంటూ అటవి శాఖ అధికారులు అడ్డుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమావేశాలు జరుగుతున్న రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఇంకా అనుమతి రాక పోవడంతో దశాబ్దాలుగా మారుమూల గిరిజన గ్రామాలలో ఈ పరిస్థితి అలాగే ఉంది. నర్సాపూర్ వాగుపై మూడో వంతెన నిర్మాణం పూర్తికాక పోవడంతో వైద్య సిబ్బంది శుక్రవారం వతెన వరకు వాహనంలో వచ్చి అక్కడి నుంచి మూడు కిలోమీటర్లు కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. మోకాలు లోతు నీటిలో వాగు దాటి సిబ్బంది గ్రామానికి చేరుకోగానే ఇంటింటికీ వెళ్లి డాక్టర్ అనురాధా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య విషయాల గురించి స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని గ్రామ పటేల్ ఇంటి వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాలు, దగ్గు, జలుబు, క్షయ లాంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో సిబ్బంది ప్రమోద్, స్వప్న, సంగీతలు, తదితరులున్నారు.



నర్సాపూర్ వాగు నీటి లోంచి వెళ్తున్న డాక్టర్ అనురాధ, సిబ్బంది



వైద్యశిబిరంలో రోగులను పరిక్షీస్తున్న వైద్యులు

'దశల వారీగా సమస్యల పరిష్కారం'

బోథ్, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్, మాజీ ఎంపీపీ చోళ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి దశాల వారీగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు గాను రోడ్ల మంజూరుకి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అంతేగాక పాఠశాలలో హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గాను చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో పొచ్చెరా క్రాస్ రోడ్డు నుంచి బోథ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు గాను రాష్ట్ర రోడ్డు భవనల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాను సమన్వయంతో నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బోథ్ పట్టణ నాయకులు మాజీ వార్డు సభ్యులు లింగారెడ్డి, నాయకులు ఎల్క రాజు, రమణగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేయాలి'

నేరడిగొండ, సెప్టెంబరు27:విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేయాలని తహసీల్దార్ ఎంఎ కలీమ్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు సరుకుల నిల్వలను పరిశీలించారు. వంట గదులను సందర్శించి నాణ్యమైన భోజనం వండిపెట్టాలని సూచించారు. అలాగే విద్యార్థులకు ఇప్పటినుంచే పరీక్షల కోసం సన్నద్ధం చేయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత, ఆర్ఐ నాగోరావు, తదితరులున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు కృషి చేయాలి

● నిర్మల్ జిల్లాలో జయంతి వేడుకలు ● నివాళులు అర్పించిన నాయకులు, ఉద్యోగులు ● అధికారికంగా కార్యక్రమ నిర్వహణ ● తెలంగాణ రాష్ట్ర సాధనలో పాత్ర గురించి ప్రశంస ప్రసంగాలు



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



మాట్లాడుతున్న ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య



ట్రిపుల్ ఐటీలో కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 27 : స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలను కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం, నిజాం వ్యతిరేక పాలనపై పోరాటం చేశారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవాడు కావడం గర్వకారణమన్నారు. సామాజిక, రాజకీయ వేత్తగా, ఉద్యమకారుడిగా సేవలందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయాలు భావితరాలు కొనసాగించాలన్నారు. ఆయన చరిత్ర యువతకు తెలియజేయాలన్నారు. కొండాలక్ష్మణ్ లాంటి మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహించడం వారికిచ్చే నివాళులన్నారు. బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మేనేజర్ నర్సింహారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, పద్మశాలి సంఘ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపూజీ అడుగు జాడల్లో నడవాలి

● తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నిర్మల్, సెప్టెంబరు 27 : కొండా లక్ష్మణ్ బాపూజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ ఉద్యమ కారుడు, స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య నాయకులతో కలిసి బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని, మలి దశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని, భావి తరాలకు ఆయన గురించి చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షు రాలు గంగాభవాని, భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి, ఏ. సుధాకర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్దా రమణ, జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, గుమిడ్యాల దత్తాద్రి, ఆడెపు భూమన్న, మిట్టపల్లి నర్సయ్య, చిట్టన్న, బిట్లింగు నవీన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ మండల కేంద్రంలో..

ముథోల్, సెప్టెంబరు 27 : మండల కేంద్రమైన ముథోల్‌లో మార్కండేయ మందిరంలో శుక్రవారం శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల గౌరవ అధ్యక్షులు కేదారి నారాయణ, జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కొక్కుల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు గణేష్, పోతన్న, కే. నర్సయ్య, చందు, గంగాధర్, సురేందర్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మండలాభివృద్ధి కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల మండలం కల్లూర్ గ్రామంలో

కుంటాల, సెప్టెంబరు, 27 : కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన కుంటాల మండల బీజేపీ నాయకులు గుద్దేటి నర్సయ్య, కల్లూరు పద్మశాలి సంఘం అధ్యక్షులు నర్సయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు బోగ నారాయణ, కోశాధికారి సాయిరాం, కల్లూర్ మాజీ సర్పంచ్ రమణ గౌడ్, మాజీ సర్పంచ్ రమణ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రజనీకాంత్, మాజీ మండల ఉపాధ్యక్షురాలు పసుల మౌనిక నవీన్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ..

దస్తురాబాద్, సెప్టెంబరు 27 : తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకర్త, స్ఫూర్తిదాత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్పరాజ్ నవాజ్, డిప్యూటీ తహసీల్దార్ యాదవరావు, ఆర్ఐ గంగన్న, సర్వేయర్ సంధ్యారాణి, జూనియర్ అసిస్టెంట్ సూరజ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో..

లక్ష్మణచాంద, సెప్టెంబరు 27 : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఉపతహసీల్దార్ అజీజ్, ఆర్ఐ నరేందర్ రెడ్డి, డీఈవో కిరణ్, సతీష్, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి), సెప్టెంబరు 27 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బాసర ఆర్జీయూకేటీలో..

బాసర, సెప్టెంబరు, 27 : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను క్యాంపస్‌లో బాసర ట్రిపుల్ ఐటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్ పావని, ట్రిపుల్ ఐటీ అధికారులు డా. రాములు, డా. రమాదేవి, డా. విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కల్లూర్‌లో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు



దస్తూరాబాద్‌లో..



లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో ..

శాస్త్ర, సాంకేతిక రంగాలపై

పట్టు పెంపొందించుకోవాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 27 : విద్యార్థులు నేటి పోటీతత్వ యుగంలో ఆశించిన రీతిలో రాణించేందుకు గాను శాస్త్ర, సాంకేతిక రంగాలపై పట్టు పెంపొందించుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇటీవల నిర్మల్‌లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన భైంసాలోని వికాస్ హైస్కూల్ విద్యార్థులకు స్థానికంగా అభినందించి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు శ్రవణ్య, ప్రతీక్షలతో పాటు పాఠశాల డైరెక్టర్ నిమ్మ రవీనా, ప్రిన్సిపల్ గాందారి రాజన్న, సైన్స్ ఉపాధ్యాయులు అబ్రార్ ఖాన్, మధుకర్‌లను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

● సోయా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపరుచుకోవాలి

మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేస్తున్న సోయా కొనుగోలు కేంద్రాలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసాలో సోయా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాచరణ్, జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతాంగానికి మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో వచ్చే నెల 5 నుంచి భైంసా డివిజన్ పరిధిలో సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లుగా వివరించారు. ముందుగా భైంసా, కుభీర్ కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తదనంతరం ప్రాధాన్యాతననుసారం ఇతర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. మార్క్‌ఫెడ్ క్వింటాలుకు రూ4,892తో సోయా దిగుబడులను కొనుగోలు చేస్తుందని వివరించారు.

ముథోల్ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ముథోల్, సెప్టెంబరు 27 : మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని స్థానిక ముథోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ముథోల్ సమీప గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను ఎలా అందించాలనే ప్రాధాన్యతగా, సౌకర్యాల మెరుగుదల జరిగేలా కృషి చేయడానికి నేను నెలకు 2 సార్లు ఆసుపత్రిని సందర్శిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్ జాదవ్, డా. సువర్ధన్, డా. రాహుల్, ముథోల్ తాలూకా మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేష్, బీజేపీ మండల నాయకులు కోరి పోతన్న, నర్సాగౌడ్, తాటివార్ రమేష్, సుదర్శన్, శ్రీనివాస్, ఎస్. పోతన్న, దశరథ్, మదన్ మోరె, వీడీసీ సభ్యులు నారాయణ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ పోరాట చరిత్ర అజరామం

● 50 వసంతాల స్వర్ణోత్సవ సభలో ప్రసంగించిన వక్తలు

నిర్మల్, సెప్టెంబరు 27 : ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తన 50 ఏళ్ల పోరాట చరిత్ర అజరామమని అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. ముందుగా గాంధీ పార్కు నుంచి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కోర్టు రోడ్డు మీదుగా టీఎన్జీవో భవన్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం టీఎన్జీవో భవన్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. నరేందర్ మాటాడుతూ... ప్రగతి శీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) చరిత్ర అజరామం అన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బొడ్డు లక్ష్మణ్, పీడీఎస్‌యూ పూర్వ జిల్లా నాయకులు కే. వెంకట స్వామి, గంధం భూమేష్, అలాగే ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి లక్ష్మీ, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి, పీడీఎస్‌యూ నాయకురాలు దుర్గా, సంజన, ప్రతాప్, సందీప్, శంకర్, 500ల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 ; కనిష్ఠం 24.2



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

శనివారం 28 సెప్టెంబరు 2024




● చెరువులో అక్రమ నిర్మాణాలపై అధికారుల మార్కింగ్

● ఖానాపూర్ చెరువులో అక్రమంగా నిర్మించిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

హైడ్రా.. పంజా

- జిల్లాలో రంగంలోకి దిగిన సంబంధిత శాఖల అధికార యంత్రాంగం
- ఖానాపూర్ చెరువులో మొదలైన ఎఫ్‌టీఎల్ సర్వే
- అక్రమ నిర్మాణాలను గుర్తిస్తూ మార్కింగ్ చేస్తున్న అధికారులు
- అధికారుల చర్యలతో భయాందోళనకు గురవుతున్న పేదలు
- ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



ఆదిలాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా హడలెత్తిస్తున్న హైడ్రాను జిల్లాలోనూ అమలు చేసేందుకు అధికారులు చర్యలు మొదలు పెట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సర్వే పనులను చేపట్టారు. మొదట జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువులో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో జిల్లావ్యాప్తంగా అధికారుల చర్యలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాకేంద్రం చుట్టూ ఉన్న ఖానాపూర్, మావల, కేఆర్‌కే కాలనీ సమీపంలో ఉన్న కుంట, ఇతర నీటి వనరులు నిలిచే స్థలాలు, ప్రభుత్వ భూముల అక్రమణలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. మొదట చెరువుల ఎఫ్‌టీఎల్, కాలువలు, కందకాల బఫర్‌జోన్ సర్వే పనులు చేపట్టి ప్రభుత్వానికి నివేదికను ఇవ్వనున్నారు. అనంతరం ప్రభుత్వ తదుపరి ఆదేశాల ప్రకారం చర్యలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. మొదట నోటీసులు ఇచ్చి.. ఆ తర్వాత అక్రమ నిర్మాణా లను కూల్చివేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సర్వేతో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఎప్పుడు? ఏం జరుగుతుందో? చెప్పలేని పరిస్థితి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

చెరువుల్లో మొదలైన సర్వే

జిల్లాకేంద్రంలో పెద్ద చెరువుగా గుర్తింపు పొందిన ఖానాపూర్ చెరువులో భారీగా అక్రమ నిర్మాణాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం, శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు సర్వే ను చేపడుతున్నారు. మొదట ఖానాపూర్ చెరువుతో పాటు మావల, కేఆర్‌కే కాలనీ కుంట, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. దీంతో అక్రమార్కుల్లో ఆందోళన కనిపిస్తోంది. చాలా వరకు పేద, మధ్యతరగతి వారే చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారుల చర్యలతో తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఇంటి నెంబర్‌తో పాటు మున్సిపల్‌లో ట్యాక్స్‌లు చెల్లిస్తున్న వారు కూడా భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలివిగా ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లను కేటాయిస్తూ రిజిస్ట్రేషన్లను చేయించుకోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా జిల్లాకేంద్రాన్ని ఆనుకుని ఉన్న మావల, బట్టిసావర్గాం, అనుకుంట, అంకోలి, తంతోలి, తదితర గ్రామాలలో విచ్చలవిడిగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తుంది. అయితే అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించిన విషయం తెలిసిందే. హైడ్రా పేరుతో హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో భారీ నిర్మాణాలను కూల్చివేయడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి విధానమే జిల్లాలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

అక్రమ నిర్మాణాల గుర్తింపు

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలను చేపట్టరాదు. కానీ గతంలో పూర్తిస్థాయి నీటి నిల్వలు లేకపోవడంతో ఖాళీగా ఏర్పడిన చెరువుల భూముల్లో కొందరు అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో చెరువుల విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ముఖ్యంగా వర్షాకాల సీజన్‌లో చిన్నపాటి వర్షాలకే చెరువులు, కుంటలు, వాగులు పొంగి ప్రవహించడంతో పట్టణ శివారు ప్రాంతాలు పూర్తిగా జలమయమై ఆస్తి, ప్రాణ నష్టానికి కారణమవుతోంది. దీంతో ఆక్రమణలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువుల పరిధిని గుర్తిస్తూ సర్వే చేపడుతున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన నిర్మాణాలను గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అధికారులు చేపడుతున్న సర్వే పనులను స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులు ఇంటి యజమానులతో తీవ్ర వాగ్వాదానికి దారి తీస్తోంది. పోలీసుల పహారాలో సర్వే చేపట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే సర్వే చేపడుతున్నామని అధికారులు చెప్పడంతో సామాన్య, మధ్య తరగతి పేద ప్రజలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

ప్రజల్లో భయాందోళన

చెరువుల హద్దులను గుర్తించేందుకు అధికారులు చర్యలు మొదలు పెట్టడంతో సమీప కాలనీల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అధికారులు సర్వే చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో సర్వేను చేపడుతున్న అధికారులు మార్కింగ్ చేస్తూ.. అక్రమ నిర్మాణాల వివరాలను నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టరాదు. కానీ కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారుల సర్వేలో గుర్తిస్తున్నారు. గత కొద్ది రోజులుగా హైదరాబాద్ పట్టణ ప్రాంతాలలో భారీ భవంతులను నేలమట్టం చేస్తున్న విషయం తెలిసిందే. అధికారుల సర్వేపై వివిధ రకాల పుకార్లు రావడంతో ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు తీస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులపై నేతలు ఒత్తిళ్లు చేస్తున్నారు. కానీ అంతా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే జరుగుతోందంటూ సమాధానం ఇవ్వడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికప్పుడు నిర్మాణాలను కూల్చివేస్తే తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. దాదాపు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో నివసిస్తున్న వారంతా పేద, మధ్య తరగతి వారే కావడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే..



: ఖమ్మర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతోనే చెరువుల హద్దులను గుర్తించేందుకు సర్వేను చేపడుతున్నాం. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ముందుకెళ్తున్నాం. జిల్లా కేంద్రంలో ఉన్న చెరువుల సర్వేను చేపట్టాలని ఆర్డీవో ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దీంతో అధికారుల బృందం చెరువుల్లో అక్రమం గా నిర్మించిన ఇళ్లను గుర్తిస్తూ మార్కింగ్ చేస్తున్నాం. ఇందులో ఏఒక్క శాఖది ప్రమేయం లేదు. ప్రభుత్వ ఆదేశాలతోనే సర్వే చేపట్టాల్సి వస్తుంది. సర్వే నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం.



సర్వేను అడ్డుకుంటున్న కాలనీవాసులు

చెరువు సర్వేను అడ్డుకున్న స్థానికులు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువులో అక్రమణలపై అధికారులు చేపడుతున్న సర్వేను కాలనీవాసులు శుక్రవారం అడ్డుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపడుతున్నామని కాలనీవాసులకు అధికారులు నచ్చచెప్పుతున్నప్పటికీ వారు వినిపించుకోలేదు. తమ ఇళ్లను ఎక్కడ కూల్చివేస్తారోనని ఆందోళన వ్యక్తం చేశారు. కాయకష్టం చేసి తాము ఇళ్లను నిర్మించుకుంటే సర్వే పేరిట తమను ఆందోళనకు గురి చేస్తున్నారని పలువురు స్థానికులు వాపోయారు.

సంక్షిప్త సమాచారం

ఎంఈవోగా ఆశన్న బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, సెప్టెంబరు 27: ఉట్నూర్ మండల నూతన మండల విద్యాశాఖ అధికారిగా లక్కారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జీ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించిన ఆశన్నను పలువురు ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్ర శ్రీనివాస్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 27: ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28న శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన సమావేశం కొనసాగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అందుబాటులో శనగ విత్తనాలు

బోథ్, సెప్టెంబరు 27: మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మహిళా సమాఖ్య ఏపీఎం మాధవ్ తెలిపారు. 25 కిలోల బస్తాలు రైతులకు అందిస్తామన్నారు. మూడు కంపెనీలకు చెందిన జేజీ11 రకం విత్తనాలతో పాటు జాకీ 9218 ఎన్‌బీజీ 40 రకం విత్తనాలు మహిళా సమాఖ్య కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఫోన్ నెం.9121102020 ద్వారా సంప్రదించాలని ఏపీఎం మాధవ్ పేర్కొన్నారు.

'రుణమాఫీ చేయకుంటే ఆందోళనలు'

తాంసి రూరల్, సెప్టెంబరు 27: రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయి రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇంకా చేయకపోవడం సమంజసం కాదని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంఘపు బొర్రన్న అన్నారు. శుక్రవారం రైతుతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుకు లింకు లేకుండా పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా రుణమాఫీ కాని రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి'

ఉట్నూర్, సెప్టెంబరు 27: గిరిజనుల మధ్య అసమానతలు, విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధిలో సమాన అవకాశాలు కల్పించాలంటే ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, జిల్లా అధ్యక్షుడు వెడమకొద్దు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం నీరంజన్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు ఈ మేరకు ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వారిలో డివిజన్ అధ్యక్షుడు ఆత్రం ప్రకాష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మడావి బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

'రైతుల అభివృద్ధి కోసమే..'

నేరడిగొండ, సెప్టెంబరు 27: రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘాలు ఉన్నాయని చైర్మన్ సాబ్లె కిషోర్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ప్రాథమిక సహకార సంఘంలో ఏర్పాటు చేసిన మహాజన సమావేశంలో అయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా నష్టపోకుండా సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు, రుణాల పంపిణీ పంటల కొనుగోలు చేపడుతున్నామన్నారు. ఇందులో సీఈవో నాగభూషణ్, ఉపాధ్యక్షుడు కలాలిరమణ, కార్యవర్గ సభ్యులు ఆడే వసంత్‌రావు, నారాయణరెడ్డి, తదితరులున్నారు.

నాగోబా ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ల శారద ● కేస్లాపూర్‌లో ప్రత్యేక పూజలు ● గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలపై ఆరా

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 27: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా దేవత ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ళ శారదా అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకటరావు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి నాగోబా చిత్ర పటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా నాగోబా ఆలయ విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ నాగోబా దేవత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలంతా హాయిగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, మాజీ సర్పంచ్ మెస్రం రేణుకా, నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేస్లాపూర్ గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, సిబ్బందికి సూచించారు. ఇందులో జిల్లా పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సేడ్మకి ఆనంద్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.



నాగోబా దేవతకు పూజలు చేస్తున్న కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ల శారద

● చైర్ పర్సన్‌ను సన్మానించిన నాయకులు

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారదను మాజీ జడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, బొల్లారపు బాబన్న మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇందులో మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మండల నాయకులు వెంకన్న యాదవ్, ప్రతాప్, విలాస్ యాదవ్, ఆర్ నారాయణ, రామచంద్ర దేశ్ముఖ, రాజమల్లు, పోచ్చన్న, తదితరులున్నారు.

అట్టహాసంగా జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు

● ప్రారంభించిన ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, సెప్టెంబరు 27: నవంబరు మాసంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాల కోసం జోనల్ స్థాయి గిరిజన క్రీడలు ప్రారంభం అయ్యాయి. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో శుక్రవారం జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేతో పాటు ఐటీడీఏ పీవోలు క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిం చిందన్నారు. ఇందులో అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరసంకేత్, ఇన్‌చార్జీ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ వసంత్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ ఎస్సీరెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జల్లాల గిరిజన క్రీడా అధికారులు కోరెడ్డి పార్థసారథి, బుక్య రమేష్, ఏటీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

● క్షేత్రస్థాయిలో మంచినీటిపై అవగాహన కల్పించాలి

ఉట్నూర్: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మంచినీటి వినియోగంపై మంచినీటి సహాయకులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, గ్రామ మంచినీటి సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఇంద్రవెల్లి: రైతులు తమ పంట పొలాలలో సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని, తద్వారా భూసారం పెరుగుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో గల రైతు వేదిక భవనంలో ఐకార్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ పనిముట్ల స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐకార్ శాస్త్రవేత్తలు డాక్టర్ వీకే సింగ్, మనోరంజన్, నర్సింహులు, సంజీవ్‌రెడ్డి, శ్రీధర్, భారత్ కుమార్, అశోక్, అశిష్, మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్, గ్రామ పటేల్ మెస్రం వెంకట్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● గోండిలిపి పండితుడి మృతి తీరని లోటు

నార్నూర్: గోండిలిపి పండితుడి మృతి యావత్ ఆదివాసీ సమాజానికి తీరని లోటు అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని గుంజాల గ్రామం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన కోట్నాక్ జంగుతో పాటు అర్క జైవంత్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇందులో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన వాహనానికి పూజలు చేస్తున్న అధికారులు

ఇచ్చోడకు నూతన అగ్నిమాపక వాహనం

ఇచ్చోడ, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయానికి నూతన అగ్నిమాపక వాహనం మంజూరవ్వడంతో శుక్రవారం వాహనపూజ నిర్వహించి ప్రారంభించారు. బోథ్ నియోజకవర్గంలోని 7మండలాలకు ఇకపై నూతన వాహన సేవలు అందనున్నట్లు ఇన్‌చార్జి ఫైర్ స్టేషన్ అధికారి అశోక్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ నెం.8712699215, 8712699214 ద్వారా సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు దేవేందర్, విజయ్‌కువర్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అంగన్‌వాడీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 27: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న భోజనంతో పాటు రిజిష్టర్‌లు, రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు సఫాయి మిత్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు.

● సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమంలో కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు చేతులకు తప్పనిసరిగా గ్లౌజులు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మభూషణ్, డీఆర్డీవో సాయన్న, డీఎల్‌పీవో ఫణిందర్, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.